

రహదారి నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పల్లె పండగలో భాగంగా శుక్రవారం రూ.5 కోట్లతో పాపయ్యవలస, దత్తి-దత్తిరాజేరు, దత్తి-భోజరాజపురం గ్రామాలకు తారురోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైకాపా పాలకుల నిర్వాకం వల్ల చాలా మంది పెట్టుబడిదారులు కంపెనీలు పెట్టేందుకు ముందుకు రాకపోగా.. రాష్ట్రంలోని కొన్ని సంస్థలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అయిదేళ్లలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో వెనుకబడిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు తామంతా కష్టపడుతున్నట్లు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రాపు సురేష్, మండల కన్వీనరు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మాజీ కన్వీనరు బోడసింగి సత్తిబాబు, సర్పంచులు, వరహాలమ్మ, సూర్యనారాయణ, మాజీ సర్పంచి సత్యారావు, మాజీ ఉప ఎంపీపీ మోహన్, గోపాలరాజు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి పాటుపడతా

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత



ఈనాడు, విజయనగరం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలను ప్రగతి బాటలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన ఆమె 'ఈనాడు'తో చరవాణిలో మాట్లాడారు. 'జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన పెంచుకుని వారందరి సహకారంతో జిల్లా ప్రగతికి పాటుపడతా. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి ప్రభుత్వం కేటాయించిన నిధులను అత్యవసర పనులకు, సమస్యల తీవ్రతపై చర్చించి, వాటి పరిష్కారానికి వినియోగిస్తా. జిల్లాలో పోలీసు శాఖ వాహనాల కొరతతో సతమతమవుతోందని.. ఉన్నవి కాలాతీతమవ్వడంతో సక్రమంగా పనిచేయడం లేదని ఈనాడు ఆమె దృష్టికి తీసుకెళ్లగా 15 ఏళ్లు నిండిన వాహనాలు వినియోగించకూడదని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఇప్పటికే 15 ఏళ్లు నిండిన వాటిలో కొన్ని పక్కన పెట్టగా, మరికొన్నింటికి మరమ్మతులు చేసి వినియోగిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఇలాంటివి సుమారు 30 నుంచి 35 వాహనాలు ఉంటాయి. ప్రభుత్వం త్వరలో నూతన వాహనాలు కొనుగోలు చేసి పంపిస్తుంది. నేరాల అదుపునకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో అమర్చిన సీసీటీవీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. పోలీసు సిబ్బంది నివాస గృహాలు, స్టేషన్ భవనాల మరమ్మతులు చేపడతాం. వాటికి సంబంధించి జిల్లాల వారీ నివేదికలు కోరతాం. జిల్లా పోలీసు ప్రధాన కేంద్రం పరిపాలన కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో నీరు కారి దస్త్రాలు తడిసిపోతున్నాయి. దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తా. గతంలో ఈ సమస్యపై పంపిన నివేదికలను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి నివేదిక కోరతా. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం. ప్రతి జిల్లాలో కానిస్టేబుళ్ల కొరత ఉంది. ఇతర జిల్లాలతో పోల్చితే విజయనగరం జిల్లాలో ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్మ్‌డ్, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో కలిపి సుమారు రెండు వేల మంది ఉన్నారు. వీరి కంటే ఇంకా పది శాతం తక్కువ ఉండవచ్చు. త్వరలో కానిస్టేబుళ్ల ఉద్యోగాలను భర్తీ చేస్తాం.

దారులకు డబ్బులే డబ్బులు

ఉమ్మడి జిల్లాకు భారీగా నిధులు

ఈనాడు-విజయనగరం: ఉమ్మడి జిల్లాలో రోడ్ల అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో పాత బకాయిలతో పాటు అదనపు నిధుల విడుదలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత అయిదేళ్లలో అధికారంలో ఉన్న వైకాపా కనీసం పట్టించుకోలేదు. గుత్తేదారులు చేసిన పనుల బిల్లులను సైతం పెండింగ్‌లో పెట్టింది. ఈక్రమంలో చాలాచోట్ల మధ్యలోనే ఆపేశారు. తాజాగా రూ.50 కోట్ల బకాయిలు చెల్లించనున్నారు. ఇతర గ్రాంట్ల ద్వారా మరో రూ.10 కోట్లు విడుదలైనట్లు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కాంతిమతి తెలిపారు. మరమ్మతులకు రూ.7.64 కోట్లు వచ్చాయని చెప్పారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విజయనగరం జిల్లాలో 79.90 కి.మీల మేర పనులు జరగనున్నాయని వెల్లడించారు.

మన్యానికి రూ.23 కోట్లు

పార్వతీపురం మన్యం జిల్లాకు త్వరలో ప్రభుత్వం రూ.23 కోట్లు విడుదల చేయనుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో ఇప్పటికే చర్చించామన్నారు. మరమ్మతులకు రూ.11.72 కోట్లతో ఈనెల 17న టెండర్లు తెరిచామన్నారు. బత్తిలి, భామిని, కొమరాడ తదితర అధ్వాన రహదారులపై తొలుత దృష్టిసారిస్తామని చెప్పారు. డిసెంబరులోగా పూర్తిచేస్తామన్నారు.



సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

నిధులు సమకూర్చే పనిలో ఉన్నాం



ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు బేబినాయన, కోండ్రు

ఈనాడు-విజయనగరం, అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యవసర పనులకు నిధులు సమకూర్చే పనిలో ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో మాదిరి ఎమ్మెల్యేలకు నిధులివ్వాలని విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి గజపతిరాజు కోరగా ముఖ్యమంత్రి పైవిధంగా స్పందించారు. మంగళగిరిలో శుక్రవారం తెదేపా శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ముందస్తు అనుమతితో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు జిల్లాలో పర్యటించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కోళ్ల లలితకుమారి, తోయక జగదీశ్వరి, బేబినాయన, కోండ్రు మురళీమోహన్ హాజరయ్యారు. ఘోషాసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే అదితి, మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు.

నీటి కలుషితంతోనే డయేరియా

● కలెక్టర్ అంబేడ్కర్ స్పష్టం



కొండపాలెం నీటి పథకాన్ని పరిశీలించి వస్తున్న కలెక్టరు అంబేడ్కర్

విజయనగరం-ఈనాడు, గరివిడి, గుర్ల, న్యూస్‌టుడే: నీరు కలుషితం కావడం వల్లే డయేరియా ప్రబలిందని కలెక్టరు బి.ఆర్.అంబేడ్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం గుర్లలో వైద్య శిబిరాన్ని సందర్శించి అధికారులతో మండల వనరుల కేంద్రంలో సమావేశమయ్యారు. గుర్ల వీధుల్లో ఏర్పాటు చేసిన కుళాయిలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కొండపాలేనికి నీరు అందిస్తున్న ఊటబావిని చూశారు. ఇక్కడ నుంచి క్లోరినేషన్ చేసి సురక్షిత నీటిని సరఫరా చేయాలని, నది కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'నీటి కలుషితం దృష్ట్యా చంపావతి నది నుంచి సరఫరాను నిలిపివేసి, నాగావళి నుంచి గరివిడి, చీపురుపల్లికి విడుదల చేస్తున్నాం. గుర్లలో 277 తాగునీటి బోర్లు ఉన్నాయి. భూగర్భ జలాలు 15 అడుగుల్లో ఉండడం బోరు నీరు కలుషితం కావడానికి ప్రధాన కారణం. అందువల్ల వీటిని సూపర్ క్లోరినేషన్ చేశాం. రెండు రోజుల తర్వాత మళ్లీ ఈ బోర్ల నీటిని పరీక్షిస్తాం. అప్పుడు తాగవచ్చు అంటేనే అనుమతి ఇస్తాం. రోజుకు రెండు సార్లు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. గుర్లలో ఏడుగురు చనిపోయినా ఇందులో ఒకరే డయేరియాతో మృతి చెందారు. మిగిలిన వారు వివిధ కారణాలతో మరణించారు. శుక్రవారం ఆరు కేసులు మాత్రమే వచ్చాయి. ప్రతి 20 ఇళ్లకు ఒక ఏఎన్ఎంను నియమించాం. వీరు ఇళ్లకు మూడు పూటలా వెళ్లి సర్వే చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని' చెప్పారు. వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టరు పద్మావతి, డీపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో భాస్కరరావు, గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ ఉమాశంకర్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, ఆర్డీవో సత్యవాణి, తహసీల్దారు ఆదిలక్ష్మి, ఎంపీడీవో శేషుబాబు పాల్గొన్నారు.

కళ్లు తిరిగి పడిపోయిన ఏఎన్ఎం

గత ఐదు రోజులుగా వైద్యశిబిరంలో ఉంటూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్న గుర్ల ఏఎన్ఎం సంతోషి కళ్లు తిరిగి పడిపోయారు. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది సపర్యలు చేపట్టారు. అనంతరం వైద్యాధికారులు వచ్చి వైద్యసేవలు అందించారు.

మరో ఆరు కేసులు

న్యూస్‌టుడే-గరివిడి, గుర్ల: గుర్లలో వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఇంత వరకు ఏడుగురు మృతి చెందారు. 160 మంది వరకు అస్వస్థతకు గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం కొత్తగా మరో ఆరు కేసులు నమోదయ్యాయి. డయేరియాను అదుపులోకి తీసుకురావడానికి అధికార యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టింది. వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ శాఖలు గ్రామంలో మొత్తం బోరుబావులు, తాగునీటి వనరులన్నీ క్లోరినేషన్ చేయించారు. రోజుకు రెండుసార్లు శానిటేషన్ పనులు చేస్తున్నారు.

చంపావతి.. కాలుష్యంతో నిండినది

● వందలాది గ్రామాలకు ఆ నీరే సరఫరా ● వ్యాధులకు అదే ప్రధాన కారణం

న్యూస్‌టుడే-గరివిడి, గజపతినగరం, గుర్ల

'చంపావతి సమీప గ్రామాల్లోని వ్యర్థాలను నదిలోకి విడిచిపెట్టడం నీరు కలుషితం కావడానికి ఒక కారణంగా గుర్తించాం. దీనిపై చర్యలు తీసుకుని ఒక నివేదికను అందించాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలిచ్చాం..'

– గురువారం గుర్లను సందర్శించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



నెల్లిమర్ల నగర పంచాయతీలో డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగంతా ఇలా నదిలో కలిసిపోతోంది. అలాగే వివిధ రకాల వ్యర్థాలను తెచ్చి పోస్తున్నారు.



గుర్ల మండలం ఆనందపురం (కొత్తపేట) పంచాయతీలో చెత్తంతా పక్కనే ఉన్న నదిలోనే పారబోస్తున్నారు. వంతెన దగ్గర ఎక్కడకక్కడే చెత్త గుట్టలుగా పేరుకుపోయింది.

గుర్లలో అతిసారానికి ప్రధాన కారణం.. తాగునీరే అని అధికారులు తేల్చారు. ఈ గ్రామంతో పాటు చంపావతి నదీ జలాలను తాగునీటి అవసరాలకు వాడుకునే గ్రామాల్లో డయేరియా ప్రభావం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో చంపావతిలో పరిస్థితులను శుక్రవారం 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించగా ఎక్కడ చూసినా కాలుష్య కారకాలే కనిపించాయి.

చంపావతి.. జిల్లాలో వందలాది గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చే వరప్రదాయిని. మెంటాడ మండలం ఆండ్ర వద్ద పుట్టిన ఈ నది గజపతినగరం, గుర్ల, నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల మీదుగా ప్రవహించి కోనాడ వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. 1,410 చ.కి.మీ. పరివాహక ప్రాంతం పొడవునా సుమారు 200 గ్రామాలకు నీరందించే 86 తాగునీటి పథకాలకు చెందిన ఊటబావులన్నీ నదిలోనే ఉన్నాయి. వీటి ద్వారా లక్షలాది మందికి తాగునీరు అందుతోంది. నెల్లిమర్ల, రామతీర్థం వద్ద ఉన్న బావులు విజయనగరం పట్టణ ప్రజల గొంతును తడుపుతున్నాయి. ఇక్కడ ఎత్తిపోతల పథకం ద్వారా రైల్వేకు నీరు అందుతోంది. గరివిడి పట్టణానికి ఇదే ఆదరవు.

మురుగు, వ్యర్థాలే..

నది సమీప గ్రామాల్లో మురుగు, వ్యర్థాలు, చెత్త అంతా కలుస్తుండడంతో కాలుష్య కాసారంగా మారుతోంది. మరో వైపు ఊటబావుల చుట్టూ ఇసుకను తోడేయడంతో బురద నీరు చేరుతోంది. కోళ్ల వ్యర్థాలన్నీ పారబోస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

నదీతీరాన ఉన్న గ్రామ పంచాయతీల నుంచి చెత్త, వ్యర్థాలను చంపావతిలో ఎక్కడా పారవేయకుండా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి

ఇసుక తవ్వకాలతో ముప్పు

★ నెల్లిమర్లలో రామతీర్థం కూడలి సమీపాన నదిలో విజయనగరం పట్టణానికి నీరందించే ఊటబావి చెంతనే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ట్రైలర్‌తో ఉన్న ఎడ్లబండిని నీటిలోకి దించి ఇనుప ఊచలతో ఉన్న జల్లెడలతో ఇసుకను లాగేస్తున్నారు. ఫలితంగా ఊటబావికి ముప్పు ఏర్పడుతోంది.

★ గజపతినగరం మండలం లింగాలవలస, పురిటిపెంట, కొణిశ, లోగిశ, తుమ్మకాపల్లి సమీపాల్లో ఇష్టానుసారంగా సాగుతున్న ఇసుక తవ్వకాల మూలంగా గజపతినగరం, బొండపల్లి మండలాల్లో 40 గ్రామ పంచాయతీలకు తాగునీరు అందించే ఊటబావులు ప్రమాదకరంగా మారాయి.

★ గుర్ల మండలం ఎస్ఎస్ఆర్ పేట వద్ద నదిలో గుర్ల, గరివిడికి తాగునీటిని అందించే ఊటబావులున్నాయి. ఇక్కడ నదిలో అడ్డుకట్టను వేసి నీటిని నిల్వ చేస్తున్నారు. వర్షాలకు పైనుంచి వ్యర్థాలన్నీ కొట్టుకు వచ్చి అక్కడ నిల్వ ఉంటుండడంతో కలుషితమవుతోంది.



గజపతినగరం మేజరు పంచాయతీ పురిటిపెంట వంతెన దగ్గర మురుగంతా ఇలా నదిలో కలుస్తోంది. కోళ్లు, చేపల దుకాణదారులంతా వ్యర్థాలను తీసుకువచ్చి వేసేస్తున్నారు.

తెప్పోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సిరిమానోత్సవం అనంతరం వచ్చే మంగళవారం పెద్దచెరువులో ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి తెప్పోత్సవం జరగనుంది. ఈ నెల 22న రైల్వేస్టేషన్ రోడ్డులోని సున్నంబట్టీ ప్రాంతంలో జరపడానికి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. శుక్రవారం తెప్ప మరమ్మతులు ప్రారంభించారు. ప్రధాన తెప్పతో పాటు మరో మూడింటిని భోగాపురం మండలం చోడిపిల్లిపేట నుంచి తెప్పిస్తున్నట్లు ఏసీ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. ఉత్సవ విగ్రహం ఉన్న దాంట్లో 15 మంది, మిగిలిన మూడింట్లో 30 మందికి అనుమతి ఉంటుందని చెప్పారు.



తెప్పను సిద్ధం చేస్తున్న నిపుణులు

24లోగా నిరక్షరాస్యుల గుర్తింపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉల్లాస్ కార్యక్రమం అమల్లో భాగంగా 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులైన మహిళలను ఈనెల 24వ తేదీలోగా గుర్తించి, జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. తన ఛాంబర్లో శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. 29న కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి, నవంబరు 2న మండల స్థాయి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, 5న ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. పొదుపు సంఘాల మహిళలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, సహాయకులు, కాపలాదారులు, అంగన్‌వాడీ సహాయకులు, పారిశుద్ధ్య కార్మికుల వివరాలు సేకరించాలని సూచించారు. డీఈవో ఎన్.ప్రేమకుమార్, వయోజన విద్య డీడీ సోమేశ్వరరావు, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, జిల్లా సచివాలయ అధికారిణి నిర్మలాదేవి, డీఎల్పీవో మోహనరావు పాల్గొన్నారు.

తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వండి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఈనెల 22 నుంచి మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్లు, వైద్యాధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో ఆన్‌లైన్‌లో సమావేశమయ్యారు. మండలాల పరిధిలో అప్రమత్తంగా ఉండి, విపత్తును ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. గ్రామాల్లో రానున్న పది రోజుల్లో నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. డయేరియా వంటి వ్యాధులు ప్రబలితే తక్షణ చర్యలు అవసరమని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఓటుహక్కుకు 6 వరకు గడువు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఓటు హక్కు పొందేందుకు నవంబరు 6వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎస్.డి.అనిత సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించేందుకు అవగాహన కల్పించాలన్నారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటిస్తామని, అభ్యంతరాల స్వీకరణ అనంతరం డిసెంబరు 30న తుది జాబితాను వెల్లడిస్తామని చెప్పారు. డీఈవో ఎన్.ప్రేమకుమార్, ఇంటర్‌బోర్డు అధికారులు ఎం.ఆదినారాయణ, భీమశంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు భాస్కరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో అనిత, చిత్రంలో డీఈవో ప్రేమకుమార్

నేడు మంత్రి లోకేశ్ రాక

ఈనాడు, విజయనగరం: రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది. ఆకస్మికంగా ఒక పాఠశాలను తనిఖీ చేయవచ్చని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. గతంలో వస్తారని అధికారులు ఎదురుచూడగా, జిల్లా మీదుగా శ్రీకాకుళం వెళ్లారు. ఈసారి భోగాపురం, డెంకాడ, కొత్తవలస మండలాల్లో ఏదో ఒక చోట పర్యటించవచ్చని తెలిసింది.

మంచి శిక్షణ కళాశాలగా తీర్చిదిద్దుతా

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రధానాచార్యుడిగా డి.రామచంద్రరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడులో అదనపు ఎస్పీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందించారు. ఆయన మాట్లాడుతూ మంచి శిక్షణ కళాశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఉప ప్రధానాచార్యుడు పీవీ.అప్పారావు, డీఎస్పీలు సీహెచ్‌వీ.రామారావు, టి.రమేష్, ఏవో భవానీ, వైద్యాధికారి వి.ఉదయ్‌కుమార్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

ఫుల్లుగా సొమ్ములొచ్చాయ్

● 2 ఏళ్లు.. రూ.270 కోట్ల ఆదాయం ● దరఖాస్తులపై రూ.132 కోట్లు అదనం

ఈనాడు, విజయనగరం

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు ఈ నెల 16 నుంచి తెరుచుకున్నాయి. పాటదారులు ఏడాదికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులో ఆరో వంతు రూ.15.02 కోట్లు ప్రభుత్వానికి కట్టారు.

విజయనగరం, మన్యం జిల్లాలోని 205 దుకాణాలకు తొలి రోజు 140కి పైగా, రెండో రోజు మరో 49 ప్రారంభం అయ్యాయి. నెల్లిమర్ల, ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోల్లో తొలి రోజు రూ.12 కోట్ల విలువైన మద్యం, రెండో రోజు రూ.9 కోట్లు, మూడో రోజు రూ.7 కోట్లకు పైగా విలువైన సరకు విడిపించారు.



రాజాంలో తెరిచిన నూతన ప్రైవేటు మద్యం దుకాణం

ఉభయ జిల్లాల్లో ఎక్సైజ్ పన్ను వివరాలు (రూ.కోట్లలో)

జిల్లా	ఎక్సైజ్ సర్కిళ్లు	దుకాణాలు	కిస్తీ (ఆదాయం)	వార్షిక (ఆదాయం)	రెండో ఏడాది (ఆదాయం)
విజయనగరం	10	153	16.28	97.70	107.47
పార్వతీపురం మన్యం	05	52	5.30	31.20	34.32

జే బ్రాండ్లు వెనక్కి

వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించిన జే బ్రాండ్ మద్యం చాలా చోట్ల మిగిలిపోయింది. సుమారు 20 వేలకు పైగా బాక్సులు ఉండగా.. దానికి సంబంధించి అధికారులు లెక్కలు తేల్చి ఐఎంఎల్ డిపోలకు తరలించాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

అంచనాలకు మించి ఆదాయం

విజయనగరం జిల్లాలో పది ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 153 దుకాణాలు.. పార్వతీపురం మన్యం జిల్లాలో 5 సర్కిళ్ల పరిధిలో 52 దుకాణాలు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో 6,634 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.132.68 కోట్ల ఆదాయం సమకూరింది. విజయనగరం జిల్లాలో తొలి ఏడాది లైసెన్స్ ఫీజు కింద రూ.97.7 కోట్లకు ఆరు విడతలుగా చెల్లించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తుల రూపంలో రూ.104.82 కోట్లు వచ్చింది. మన్యం జిల్లాలో తొలి ఏడాది లైసెన్స్ ఫీజు కింద రూ.31.20 కోట్లు, దరఖాస్తుల రూపంలో రూ.27.86 కోట్లు ఆదాయం చేరింది.

★ విజయనగరం జిల్లాలో వార్షిక రుసుములో తొలి కిస్తీ కింద రూ.16.28 కోట్లు, మన్యం జిల్లాలో రూ.5.30 కోట్లు దుకాణాలు దక్కించుకున్న 48 గంటల్లోనే చెల్లించారు.

★ తొలి ఏడాది రూ.55 లక్షలు రుసుము ఉన్న దుకాణానికి వచ్చే ఏడాది పది శాతం పెంపుతో రూ.60.50 లక్షలు.. రూ.65 లక్షల దుకాణానికి రూ.71.50 లక్షలు చెల్లించాలి. దీంతో ప్రభుత్వానికి తొలి ఏడాది కంటే రెండో ఏడాది ఆదాయం పెరగనుంది.

జాతీయ శిక్షణా తరగతులకు ఎంపిక


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం, న్యూస్‌టుడే: కేంద్ర విద్యాశాఖ నిర్వహిస్తున్న జాతీయ ప్రేరణ శిక్షణ తరగతులకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి. సౌజన్య ఎంపికైందని గైడ్ టీచర్ వేణుగోపాల్ తెలిపారు. అహ్మదాబాద్‌లో ఈనెల 20 నుంచి ఏడు రోజులపాటు జరుగుతాయన్నారు. ఇతి హాసాలు, సాంకేతిక సృజనాత్మకత, క్రీడలు, ఆయుర్వేదం, ఆహారం- ఆరోగ్యం, ఆర్కిటెక్చర్, వస్త్రాలకు సహజ రంగులు అద్దడం, విజ్ఞాన ప్రదర్శన, దృశ్యకళలు, ఖగోళశాస్త్రం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు వసంత్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

దారులు దారుణం ఒళ్లు హూనం


అధ్వానంగా కలిగొట్టు ప్రధాన మార్గం


గళావల్లి రోడ్డు దుస్థితి

కురుపాం మండలంలోని కలిగొట్టు గ్రామం నుంచి ఉదయపురం పంచాయతీ కేంద్రానికి వెళ్లే తారు రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే తారు ఊడిపోయి, కోతకు గురై రాళ్లు తేలిపోయాయి. దీంతో గతంలో ఈ గ్రామానికి ఉన్న ఆర్టీసీ సర్వీసును సైతం నిలిపేశారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బీ, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు నిర్మల, అప్పారావు వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామన్నారు. ★ బలిజిపేట మండలంలోని గంగాడ నుంచి గళావల్లి వెళ్లే రహదారిదీ ఇదే దుస్థితి. చాలా చోట్ల కోతకు గురై రాళ్లు తేలాయి. కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేవారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం గొయ్యి చుట్టూ కర్రలు పెట్టి వదిలేశారు. రహదారి బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ నాగభూషణరావును వివరణ కోరగా.. రూ.50 లక్షలు మంజూరయ్యాయని, రహదారి బాగు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం, బలిజిపేట



తవ్వేసి.. ప్రమాదాలకు వదిలేసి

విజయనగరం నగరపాలిక పరిధిలో పైపులైన్ మరమ్మతులకు గుంతలు తీసి వదిలేస్తున్నారు. దీంతో రాత్రి వేళల్లో పెద్దత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితికి అద్దం పడుతోంది కంటోన్మెంట్ ప్రాంతంలోని ఈ భారీ గొయ్యి. స్థానిక హుండా ఎలిమెంటరీ పాఠశాల నుంచి మార్కెట్‌కి వెళ్లే దారిలో 20 రోజుల కిందట ప్రధాన రోడ్డు మధ్యలో భారీ గుంత తవ్వారు. నేటికీ పూడ్చలేదు. కలెక్టరేట్, గంట్యాడ, గజపతినగరం వైపునకు వెళ్లే మార్గం కావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే పూడుస్తామని ఏఈ రవి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

శిక్షకులు తోడుగా.. కొలువుల పండగ



ఒకప్పుడు వారంతా క్రీడాకారులు.. ఎన్నో ఆటుపోట్లను అధిగమించి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. నమ్ముకున్న క్రీడను విడవకుండా ముందుకు సాగుతూ.. నేడు ఎంతో మందికి వెన్నుదన్నుగా నిలుస్తూ శిక్షకులుగా సేవలందిస్తున్నారు. పతకాలు తెచ్చేలా తీర్చిదిద్దుతున్నారు.. కొలువుల అన్వేషణలో ఉన్న నిరుద్యోగులకు భరోసా కల్పిస్తూ అవసరమైన తర్ఫీదునిస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు శిక్షకులు. వారి ప్రస్థానంపై కథనం.
- న్యూస్‌టుడే, విజయనగరం క్రీడావిభాగం

సవాళ్లను అధిగమిస్తూ..

అంతర్జాతీయ వేదికపై పారా అథ్లెట్‌గా సత్తా చాటిన వై. మధుసూదనరావు స్వస్థలం కెల్ల. వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. పదో ఏట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ చేయి దెబ్బతింది. అయితేనేం తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని, అప్పుడే గుర్తింపు వస్తుందని భావించి మైదానంలోకి అడుగుపెట్టారు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదిగారు. 2016లో జైపూర్‌లో జరిగిన టోర్నీలో రెండు కాంస్యాలు, హరియాణా మీట్‌లో(2017)లో రెండు రజతాలు, స్వర్ణం సాధించారు. 2018లో ఐర్లాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ టోర్నమెంటులో 100, 200 మీటర్ల పరుగులో రాణించారు. ఐదేళ్లుగా శిక్షణ ఇస్తున్నారు. తన వద్ద సాధన చేసిన వారిలో 50 మంది వరకు ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యారని ఆయన చెబుతున్నారు.

ప్రథమస్థానం..

నగరానికి చెందిన ఎ. గణేష్ వెంపడాం జడ్పీ పాఠశాలలో పీడీగా సేవలందిస్తున్నారు. 2012 డీఎస్సీలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచారు. గురువుగా, శిక్షకుడిగా పనిచేస్తున్నారు.

పీఈటీగా చేస్తూ..



2009లో పీఈటీగా ప్రస్థానం ప్రారంభించిన ఎ. రామకృష్ణ ప్రస్తుతం పాలవలస జడ్పీ పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నారు. కేవలం వ్యాయామ ఉపాధ్యాయ వృత్తికే పరిమితం కాకుండా తాను నేర్చుకున్న విద్యను మరికొంతమందికి అందిస్తున్నారు. హైజంప్‌లో జాతీయస్థాయిలో రెండుసార్లు, హ్యాండ్‌బాల్‌లో ఒకసారి సత్తా చూపారు. తన శిక్షణలో ఇప్పటివరకు 20 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. తాను పనిచేస్తున్న పాఠశాలలో 8 మందిని జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు.

100 మందికి ఉద్యోగాలు



దాసన్నపేట ప్రాంతానికి చెందిన జి. నర్సింగరావు మాన్సాస్ పాఠశాలలో పీఈటీగా చేస్తున్నారు. 100, 400మీ పరుగులో జాతీయస్థాయిలో 20 సార్లు, జాతీయస్థాయిలో రాణించారు. పాఠశాలతో పాటు విజ్జీ మైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో తర్ఫీదునిస్తున్నారు. రైల్వే, ఎస్ఎస్‌సీ, పోలీసు శాఖలో 100 మంది వరకు యువకులు చేరినట్లు వెల్లడించారు.



అథ్లెటిక్ 800 మీటర్ల పరుగులో జాతీయస్థాయి పతకాన్ని దక్కించుకున్నారు. జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో స్వర్ణం, రెండు రజతాలు సాధించారు. ఆలిండియా టోర్నీలో స్వర్ణంతో మెరిశారు. వివిధ విభాగాల్లో 11 మంది శిష్యులు కొలువులు సాధించారని చెప్పారు.

అదే లక్ష్యం..



నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగిన అథ్లెట్ ఎ. అర్జున్ సీతానగరం మండలం గాదెలవలసకు చెందినవారు. డిగ్రీతో పాటు క్రీడ విద్య కోర్సు పూర్తిచేసి 'ఈనాడు' ప్రోత్సాహంతో లక్ష్య బృందంలో చేరారు. ప్రస్తుతం బలిజిపేట మండలం చిలకలపల్లిలో శిక్షణ ఇస్తున్నారు. 2013లో సాధన ప్రారంభించి 2014లో స్కూల్‌గేమ్స్ అండర్-14లో అడుగుపెట్టాడు. 2016 నుంచి 2021 వరకు రాష్ట్ర తరఫున వివిధ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. అనేక పతకాలను తన ఖాతాలో వేసుకున్నాడు. తన వద్ద శిక్షణ పొందిన వారిలో 16 మంది ఆర్మీలో, నలుగురు ఎస్ఎస్‌సీలో, 9 మంది కానిస్టేబుళ్లుగా చేరానని, మరింత మందిని డిఫెన్స్‌లోకి పంపించడమే లక్ష్యమని చెబుతున్నాడు.



ఉత్సాహంగా చదరంగం పోటీలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని డీఈవో పగడాలమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్కూల్ గేమ్స్ చదరంగం పోటీలను పార్వతీపురంలోని ఆర్సీఎం పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. అండర్- 14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లాల నుంచి వందల సంఖ్యలో బాల, బాలికలు పాల్గొన్నారు. ఒక్కో విభాగం నుంచి 12 మంది చొప్పున 24 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం. మురళీకృష్ణ తెలిపారు. డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్, ఎంఈవోలు, పీడీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పాలకొండ, సాలూరు: పాలకొండ, సాలూరు ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సందేహాలు, సలహాల కోసం శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను 99592 25057(పాలకొండ), 99592 25622(సాలూరు) నంబర్లకు తెలియజేయాలని సంబంధిత అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

● ఇద్దరు విద్యార్థులకు గాయాలు ● కిలోమీటరు పొడవున నిలిచిన వాహనాలు


నుజ్జయిన ద్విచక్ర వాహనం


ప్రమాదానికి కారణమైన లారీ

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని రైల్వే వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్టవలసకు చెందిన కె. సత్యనారాయణ(43), విశాల్ దుర్మరణం చెందారు. జశ్వంత్, శిరీష తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్యనారాయణ కుమార్తె నూడిల్స్ కావాలని కోరగా ఇద్దరూ కలిసి పట్టణానికి వచ్చారు. తిరిగి వెళుతూ.. అదే గ్రామానికి చెందిన విశాల్, జశ్వంత్‌ను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. రైల్వే వంతెనపై కంటైనర్ లారీ వీరి వాహనాన్ని ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. వాహనంపై ఉన్న ముగ్గురు చిన్నారులూ తుళ్లిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. విశాల్ మరణించాడు. లారీ చోదకుడు ఆపకుండా సుమారు అర కిలోమీటరు దూరం ద్విచక్ర వాహనాన్ని ఈడ్చుకుంటూ వెళ్లిపోయాడు. స్థానికులు వాహనాన్ని అడ్డుకోవడంతో ఆగిపోయాడు. చక్రాల కింద ద్విచక్రవాహనం ఇరుక్కుపోయింది. సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ రమేష్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రహదారికి ఇరువైపులా కిలోమీటరు దూరం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. మృతుడి శరీరం తునాతునకలైంది. ఇప్పుడే పట్టణంలోకి వెళ్లి వస్తానన్న భర్త.. తిరిగి రాకపోవడంతో భార్య ఇందు ఘటనా స్థలానికి చేరుకుని రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.


ఆసుపత్రిలో క్షతగాత్రులు


రోదిస్తున్న ఇందు

ఆర్టీసీ బస్సులో దైవ క్షేత్రాలను దర్శిద్దాం

పార్వతీపురం కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: కార్తీక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో శైవక్షేత్రాలు, శబరిమల, పంచారామాలను దర్శించుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పార్వతీపురం డిపో మేనేజర్ దుర్గ పేర్కొన్నారు. శుక్రవారం సంబంధిత గోడప్రతులను విడుదల చేశారు. apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా, గుర్తింపు పొందిన ఏజెంట్ల వద్ద ముందుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న డీఎం దుర్గ, ఇతర అధికారులు

ఆరు రోజుల ప్యాకేజీ..

శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. 6 రోజుల యాత్రకు బస్సులు అందుబాటులో ఉంటాయి. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళని, ఎరుమేళి, శబరిమల, మధురై, కంచి, తిరుపతి, విజయవాడ క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉంటుంది. సూపర్ లగ్జరీకి ఒక్కొక్కరికి రూ.7,500, అల్ట్రా డీలక్స్‌కు రూ.7300 టికెట్‌గా నిర్ణయించారు.

ప్రతి సోమవారం ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలోని గుంప సోమేశ్వరాలయం, అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వర స్వామి, నారాయణపురం నీలకంఠేశ్వర స్వామి, సంగం సంగమేశ్వర స్వామి, తోటపల్లిలో ఆలయాలను ఒక్క రోజులోనే దర్శించుకునేలా బస్సులు నడపనున్నారు. నవంబరు 4, 11, 18, 25 తేదీలు (ప్రతి సోమవారం) సర్వీసులు ఉంటాయి. పల్లె వెలుగు బస్సులో ఒక్కొక్కరికి రూ.350 ఛార్జీ ఉంటుంది. ఆయా తేదీల్లో రోజూ ఉదయం 6 గంటలకు పార్వతీపురం కాంప్లెక్స్‌లో బస్సు బయలు దేరుతుంది. సాయంత్రం పార్వతీపురం చేరుకుంటుంది.

పంచారామ పుణ్యక్షేత్రాలకు..

పంచారామాలకు నవంబరు 03, 10, 17, 24 తేదీల్లో బస్సులు నడుపుతారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షరామం, సామర్లకోట పుణ్య క్షేత్రాలను దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. పార్వతీపురం నుంచి ఒక్కొక్కరికి రూ.2,150, బొబ్బిలి నుంచి రూ.2,075, రామభద్రపురం నుంచి రూ.2,050గా ఛార్జీలు ఉన్నాయి.

రిజర్వేషన్‌కు అవకాశం..

ఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా, గుర్తింపు పొందిన ఏజెంట్ల వద్ద రిజర్వేషన్‌కు అవకాశం కల్పించారు. 73828 34904, 90001 01080 చరవాణి నంబర్లను సంప్రదించినా టికెట్లు ఇస్తారు. సందేహాలకు 99592 25621, 73829 24103కు కాల్ చేయాలని డీఎం దుర్గ తెలిపారు. బస్సుకు సరిపడా భక్తులు ఉంటేనే నడుపుతామని వెల్లడించారు.

కలెక్టరు ఆధ్వర్యంలో ఐటీడీఏ పరిష్కార వేదిక

సీతంపేట: ఐటీడీఏ కార్యాలయంలో ఈనెల 21న నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హాజరు కానున్నట్లు ఐటీడీఏ పీవో సి. యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని, నేరుగా వినతులు అందజేయాలని సూచించారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ అభ్యర్థుల జాబితా

విద్యావిభాగం: కేజీబీవీల్లో బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి సంబంధించిన అభ్యర్థుల జాబితాను vizianagaram.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు విజయనగరం డీఈవో ఎన్. ప్రేమకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు చూసుకోవాలని కోరారు.

సార్వత్రిక విద్యలో ప్రవేశాలకు గడువు పెంపు

కొత్తవలస, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 వరకు గడువు పెంచినట్లు డీఈవో ప్రేమకుమార్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో 29, రూ.500తో 31 వరకు అవకాశం ఉందన్నారు. www.apopen-school.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు నమోదు చేసుకుని, సమీపంలోని ఓపెన్ కేంద్రానికి వెళ్లి, విద్యార్హత ధ్రువపత్రాలను సమర్పించి, రుసుము చెల్లించాలని కోరారు.

అర్హతలు ఇలా..

పదో తరగతిలో చేరేందుకు విద్యార్థులకు 2024 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు ఉండాలి. రికార్డు షీటు/టీసీతో పాటు ఆధారు కార్డు, తల్లి/తండ్రి ఆధార్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలైతే కుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులకు సదరం పత్రం/వైద్య ధ్రువీకరణ పత్రం అవసరం. విద్యార్హత లేకపోతే జనన ధ్రువీకరణ పత్రంతో పాటు చదవడం, రాయడం వచ్చని స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలి. ఇంటర్మీడియట్‌లో చేరాలంటే పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలి. ఉత్తీర్ణత ధ్రువపత్రంతో పాటు ఆధార్ కార్డు, తల్లి/తండ్రి ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలు పొందుపరచాలి. దివ్యాంగులైతే సదరం పత్రం ఇవ్వాలని డీఈవో సూచించారు.

గి.సం.శాఖలో ఉద్యోగోన్నతులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఇంజినీరింగు శాఖలో ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం ఈఈగా పని చేస్తున్న కేవీఎస్ఎన్. కుమారను పర్యవేక్షక ఇంజినీరుగా నియమించి విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలో డిప్యూటీ సీఈగా పంపించారు. పి. కోనవలస డీఈఈ మణిరాజుకు ఈఈగా ఉద్యోగోన్నతి కల్పించారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారి ధ్రువపత్రాలను శనివారం పరిశీలిస్తామని డీఈవో పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి పరిశీలన ప్రారంభం అవుతుందన్నారు. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంఈడీ, డిప్లొమా, ఇతర ధ్రువపత్రాలు తీసుకురావాలని సూచించారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్/లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

కల్వర్టు నిర్మాణం.. గిరిజనుల్లో ఆనందం

ఈనాడు కథనానికి స్పందన

రామభద్రపురం, న్యూస్‌టుడే: మండలంలోని కాకర్లవలస రహదారి వద్ద రూ.1.5 లక్షలతో కల్వర్టు, కంకర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. 'జోరు వాన.. పోటెత్తిన వరద' శీర్షికన సెప్టెంబరు 9న వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ సర్పంచి మజ్జి రాంబాబు ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మాణం జరగడంతో సమస్య పరిష్కారమైంది.


కాకర్లవలస రహదారిపై నూతన కల్వర్టు

వసతి గృహాల్లోని సదుపాయాలపై పరిశీలన

రాజాం, రేగిడి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయనే అంశంపై సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని బీసీ కళాశాల బాలుర, రేగిడి మండలం అంబడలోని ప్రభుత్వ బాలుర, దేవుదళలోని కేజీబీవీ వసతి గృహాలను పరిశీలించి, అక్కడి వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్.సీహెచ్ జయదేవ్, కార్యదర్శి వై.ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.


వసతులపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్



ఉత్సాహం నిండుగా.. సృజన మెండుగా



రాజాం పట్టణంలోని విద్యానికేతన్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ప్రతిభా పాటవ పోటీలు' శుక్రవారం నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు సాంకేతిక అంశాలను స్పృశిస్తూ తమ ప్రతిభ చాటారు. కె.శ్రీకృష్ణ చైతన్య (ప్రథమ), జె. దీక్షిత (ద్వితీయ), పి.గురుచరణ్ (తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావు, డైరెక్టర్ గట్టి పద్మావతి, సమన్వయకర్త మనోజ్‌ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించి విజేతలను అభినందించారు. – న్యూస్‌టుడే, రాజాం

మురుగు పారదు.. దుర్గంధం ఆగదు

ఇదీ గజపతినగరం, పురిటిపెంట వాసుల ఇబ్బంది

గజపతినగరం పంచాయతీలోని మేదర వీధి నుంచి, కుమ్మరి వీధి, జయంతి కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు గజపతినగరం ప్రధాన కాలువకు చేరే కూడలి ఇది. పక్కా కాలువ లేకపోవడంతో మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది.



న్యూస్‌టుడే, గజపతినగరం

వర్షం పడితే వీధుల్లో వరద నిండి.. చినుకులు లేకున్నా వాడుక నీరు రహదారులపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గజపతినగరంతో పాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పురిటిపెంట న్యూకాలనీ, మామిడిబంద, మండలవారి కాలనీల్లో పరిస్థితి ప్రజలకు ఇబ్బందికరంగా తయారైంది. గజపతినగరం పంచాయతీలోని మేదర వీధి, జయంతి, బీసీ, ఎస్సీ కాలనీల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. పురిటిపెంట న్యూకాలనీలోని బాలాజీ నగర్, మామిడిబంద కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్సు ప్రాంతం, మండలవారి కాలనీల్లో మురుగు కాలువలు లోతట్టుగా ఉండడం, జాతీయ రహదారి డ్రైనేజీ ఎత్తుగా ఉన్నందున నీరు నిల్వ ఉండి దోమల పెంపక కేంద్రాలుగా మారాయి. జాతీయ రహదారి పనుల్లో భాగంగా మురుగు వ్యవస్థ అనుసంధానం సక్రమంగా జరగక ఇక్కట్లు తప్పడం లేదు.

ఇది పురిటిపెంట న్యూకాలనీకి చెందిన బాలాజీనగర్ కాలనీ డ్రైనేజీ. మెంటాడ రోడ్డు, ఇతర కాలనీ వీధుల నీరు జాతీయ రహదారి ప్రధాన కాలువకు సక్రమంగా అనుసంధానం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



పందులు, కుక్కలకు నిలయం

డ్రైనేజీలు సరిగా లేకపోవడం, తుప్పలు అధికంగా ఉన్నందున పందులకు ఆవాసంగా మారాయి. డెంగీ, ఇతర వ్యాధులు ప్రబలుతున్నా పందుల నివారణ చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి నెలా కుక్కకాటుతో రెండు పంచాయతీల నుంచి ప్రాంతీయ ఆసుపత్రిలో 15 మందికి తక్కువ లేకుండా చికిత్స పొందుతున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

పురిటిపెంటలో పల్లె పండగ నిధులు రూ.కోటితో సమస్య ఉన్న ప్రాంతాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు కార్యదర్శి తిరుపతి తెలిపారు. పందులు, కుక్కల నివారణకు రెండు పంచాయతీలు ఉమ్మడిగా చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తున్నాం. గజపతినగరంలో మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు కార్యదర్శి జనార్దనరావు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? బొద్దాం రహదారి పక్కనే చెత్తచెదారాలు వేయడంతో ఇబ్బందికరంగా ఉంది. దుర్వాసన భరించలేకపోతున్నాం. - స్థానికులు

• పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తాం. - శ్రీనివాసరావు, ఎంపీడీవో

– న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

? గంట్యాడ మండలంలోని సిరిపురంలో మురుగు కాలువలు చెత్తాచెదారాలతో నిండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. -స్థానికులు

• తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి చెత్తాచెదారాలను తొలగిస్తాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ, గంట్యాడ

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? రామభద్రపురం మండలంలోని బూసాయవలసలో ప్రధాన రహదారి బాగుచేయాలి. - స్థానికులు

• రహదారి మరమ్మతులకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం. - ప్రణయ, ఆర్అండ్‌బీ ఏఈ, రామభద్రపురం

– న్యూస్‌టుడే, రామభద్రపురం



ప్రతిభ చాటుకున్నారు



బొబ్బిలి పట్టణంలోని సాయినగర్ శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎ.జోత్స్న ఆదిత్య (8వ తరగతి), బి.జ్యోతిర్మయి (8వతరగతి), సీహెచ్ ప్రత్యూష (9వ తరగతి) విజేతలుగా నిలిచారు. పాఠశాల కరస్పాండెంట్ కొల్లి రామారావు, ప్రిన్సిపల్ పద్మ, గౌరీశంకరరావుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు పి.వి.ఎల్.ఎన్. సాయిబాబా ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. – న్యూస్‌టుడే, బొబ్బిలి

అసంపూర్తిగా వదిలేశారు

బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లిలో సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో తలపెట్టిన సామాజిక మరుగుదొడ్డి నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. ఎంపీ ల్యాడ్స్ నిధులతో ప్రత్యేకంగా మహిళల కోసం దీన్ని నిర్మించారు. ఆరు నెలలు అవుతున్నా ఇంకా చివరి దశలో నిలిచిపోయింది. ఎంపీల్యాడ్స్ నిధులు చాలక పురపాలక సాధారణ నిధులను కేటాయించినా పనులు పూర్తి కాలేదు. నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుంటానని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి



మురుగు శుద్ధి ప్లాంటు నిర్మించొద్దు


కమిషనర్ రామలక్ష్మి, సీఐ సతీష్‌కుమార్‌తో పారిశుద్ధ్య కార్మికుల వాగ్వాదం


బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని సంఘం వీధిలో ప్రభుత్వ స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాన్ని అప్పగించాలని, అందులో మురుగు శుద్ధి ప్లాంటు నిర్మిస్తే ఊరుకోమని పారిశుద్ధ్య కార్మికులు సిటు ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్లాంటు నిర్మాణానికి పురపాలక అధికారులు స్థలాన్ని జేసీబీతో చదును చేసే పనులు ప్రారంభించారు. కార్మికులు అంతా అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. కమిషనర్ రామలక్ష్మి, సీఐ సతీష్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పనులు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రస్తుతానికి నిర్మాణాలు చేపట్టడం లేదని, తాత్కాలికంగా పిచ్చి మొక్కలు తొలగిస్తామని కమిషనర్ అన్నారు. ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లాక పనులు ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. పట్టాలు ఇచ్చేవరకు ఊరుకునేది లేదని సిటు నాయకులు శంకరరావు మద్దతు పలికారు.

మద్యం దుకాణం వద్దే వద్దు

బొబ్బిలి, రేగిడి, న్యూస్‌టుడే: మార్కెట్‌లో మద్యం దుకాణం పెడితే ఊరుకునేది లేదని మహిళలు శుక్రవారం ఉదయం దుకాణం ముందు బైఠాయించారు. ఇటీవల లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న ఓ యజమాని మార్కెట్‌లో దుకాణాన్ని తెరవడంతో మహిళలు తీవ్ర స్థాయిలో అభ్యంతరం తెలిపారు. గతంలో ఈ సముదాయంలోనే దుకాణం ఉండేదని, అప్పుడు ఎందుకు అభ్యంతరం తెలపలేదని నిర్వాహకులు అన్నారు. సీఐ చిన్నంనాయుడు చేరుకుని ఇబ్బందిగా ఉంటే ప్రత్యామ్నాయం చూస్తామని భరోసా ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. • రేగిడి మండలం దేవుదళ కూడలిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని తెదేపా నాయకులు కె.కోటేశ్వరరావు, పుర్లి మాజీ సర్పంచి రామినాయుడు సచివాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేశామని తెలిపారు.


మద్యం దుకాణం వద్ద బైఠాయించిన మహిళలు

రహదారులే వరద కాలువలు


గతంలో నిర్మించిన కాలువలు అధ్వానంగా..

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రధాన గ్రామమైన గొల్లపల్లిలో మౌలిక సదుపాయాల లేమి కనిపిస్తోంది. మురుగు పారే డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. చినుకు పడితే రహదారులపై వరదనీరు కనిపిస్తోంది. ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు లేక చినుకు పడితే మోకాలు లోతు నీరు నిలిచిపోతోంది. బైపాస్ రోడ్డులోని దాడితల్లి ఆలయం నుంచి గొల్లపల్లి వెళ్లే వరకు చెరువులా మారుతోంది. గుడి వెనుక చెరువు నీరు రహదారిపైకి చేరుతోంది. ఫీడర్ ఛానళ్లు లేక గ్రామంలోని పలు వీధుల్లోకి నీరు వస్తోంది. ప్రధాన వీధులతో పాటు కొన్ని శివారు ప్రాంతాల్లో అప్పట్లో నిర్మించిన కాలువలు శిథిలావస్థకు చేరడంతో నీరు పారడం లేదు. దోమల బెడద ఎక్కువగా ఉంది. అంబేడ్కర్ కాలనీలో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉంటోంది. వీణల కేంద్రం, హరిజన కాలనీల్లో కూడా మౌలిక సదుపాయాలు లేవు. వీధి దీపాల సమస్య ఉంది. సరిపడా కుళాయిలు లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో కుళాయిల నుంచి మురుగు నీరు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన వార్డు సందర్శన కార్యక్రమంలో పలు సమస్యలపై అధికారులను స్థానికులు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపామని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పుర కమిషనర్ రామలక్ష్మి తెలిపారు.


చినుకు పడితే ఇలా రహదారులపైకి చేరుతున్న వరద

చీపురుపల్లి నుంచి గుర్లకు తాగునీరు

నీటి నాణ్యత పరీక్షలు చేసి సరఫరా


చీపురుపల్లిలో భూతల జలాశయాల నుంచి ట్యాంకర్లకు నింపుతున్న తాగునీరు

చీపురుపల్లి, చీపురుపల్లి గ్రామీణం, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గుర్లలో డయేరియా ప్రబలడంతో అధికారులు అప్రమత్తమై గ్రామ ప్రజలకు చీపురుపల్లి నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. చీపురుపల్లి మండల పరిషత్తు కార్యాలయం వెనుక ఉన్న భూతల జలాశయాల నుంచి నీటిని ట్యాంకర్లకు ఎక్కించి గుర్లకు సరఫరా చేస్తున్నారు. చీపురుపల్లికి సంకిలిలో ఉన్న సుజలధార నీటి పథకం నుంచి తాగునీరు వస్తోంది. 14 ట్యాంకర్లను ఏర్పాటు చేసి నాలుగు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా గుర్లకు నీటిని పంపిస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో ట్యాంకర్లతో సరఫరా చేసే నీటికి రెండు సార్లు నాణ్యత పరీక్షలు చేస్తున్నారు. • చీపురుపల్లి మండలంలో తాగునీటి నీటి నిల్వ ట్యాంకులను శుభ్రం చేసే పనులు జరిగాయి. మండలంలో నిమ్మలవలస, జి.ములగాం, గొల్లలపాలెం, చీపురుపల్లి గ్రామాల్లో ఓహెచ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ జరిగింది. పారిశుద్ధ్య సిబ్బందితో ట్యాంకు శుభ్రత పనులు చేపట్టినట్లు ఈవోపీఆర్‌డీ ఐ. సురేష్ తెలిపారు. • కలెక్టర్ ఆదేశాలతో బొబ్బిలి మండలంలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుక్రవారం పిరిడి, కోమటిపల్లి, కలవరాయి, పారాది, చింతాడ, కలవరాయి తదితర గ్రామాల్లో మూడు శాఖల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఖాళీ కుండీలు, కొబ్బరి చిప్పల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి ప్రజలకు పలు సూచనలు చేశారు.


కోమటిపల్లిలో ట్యాంకు లోపల శుభ్రం చేస్తున్న కార్మికుడు


జి.ములగాంలో తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్

సంక్షిప్త సమాచారం

గొర్రెలకు నట్టల నివారణ

రామభద్రపురం: రామభద్రపురంలో శుక్రవారం గొర్రెలకు నట్టల నివారణ మందులను పశువైద్య సహాయకురాలు శ్యామల చేతులమీదుగా వేశారు. మండలంలోని 21 వేల గొర్రెలకు మందులు వేయడానికి చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారిణి హిరణ్య తెలిపారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

రాజాం: వికాసతరంగిణి ఆధ్వర్యంలో సాయినగర్‌లో 20 నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కేంద్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి టీటీవీ రమణమూర్తి తెలిపారు. ఉదయం 5 నుంచి 6.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోడప్రతుల ఆవిష్కరణ

రామభద్రపురం: మండలంలోని నాయుడువలసలో శుక్రవారం హెచ్ఎం జేసీ రాజు ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలంటూ గోడప్రతులను విడుదల చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ గోడప్రతులను పలు చోట్ల అంటించారు.

గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి

బొండపల్లి: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎంపీడీవో జి.గిరిబాల అన్నారు. రయింద్రంలో సర్పంచి ఎం.శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో కూడిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈవోపీఆర్‌డీ ఎ. రఘుపతిరావు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రాజాం గ్రామీణం: పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని ఎంఈవో దుర్గారావు ఆదేశించారు. మండలంలోని గోపాలపురం పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు.

22న హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం: నవదుర్గ, జ్ఞానసరస్వతి ఆలయాల్లో హుండీల ఆదాయాన్ని 22న లెక్కించనున్నట్లు ఈవో పి. శ్యామలరావు తెలిపారు. ఆలయ తనిఖీదారు, ధర్మకర్త సమక్షంలో లెక్కించనున్నట్లు చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

వంగర: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వంగర మండల తెదేపా అధ్యక్షుడు పిన్నింటి మోహనరావు అన్నారు. శివ్వాం, రుషింగి, వి.వి.ఆర్.పేట గ్రామాల్లో పల్లెపండగలో భాగంగా సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

సక్రమంగా పంటకోత ప్రయోగాలు

బొబ్బిలి గ్రామీణం: వరి పంట దిగుబడి అంచనా వేయడానికి పంటకోత ప్రయోగాలు సక్రమంగా నిర్వహించాలని ఏడీఏ శ్యామ్‌సుందర్ కోరారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం సహాయకులు, ఎంపీఈవోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి


విద్యార్థులకు దరఖాస్తులు అందజేస్తున్న తహసీల్దారు రాజారావు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకునే విద్యార్థులంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎన్.రాజారావు సూచించారు. ఓటు హక్కు నమోదు, ప్రాధాన్యతపై అవగాహన సదస్సు చీపురుపల్లిలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఏడీఎన్ఎస్వీ ప్రసాద్, ఎన్నికల ఉప తహసీల్దారు హర్షవర్ధిని, ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందెన్న సంబరాలు

తెర్లాం, న్యూస్‌టుడే: నందెన్న సంబరాలు మండలంలో ప్రారంభమయ్యాయి. గురువారం రాత్రి ఊరేగింపుగా గ్రామాల్లోకి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం నుంచి మండలంలోని వెలగవలస, ఎమ్మార్ అగ్రహారం, లోచర్ల, తెర్లాం, నందబలగ, నందిగాం, ఆమిటి, నెమలాం, ఉద్దవోలు, పెరుమాళి, చినపాలవలస, చుక్కవలస తదితర గ్రామాల్లో నందీశ్వరుల విగ్రహాలను తెచ్చి వేదికలపై ఏర్పాటు చేసి పూజలు చేశారు.



పల్లెల్లో అభివృద్ధి పండగ


రాగోలులో భూమిపూజలో పాల్గొన్న రామ్‌మల్లిక్‌నాయుడు

గుర్ల, న్యూస్‌టుడే: మండలంలోని రాగోలులో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రహదారుల నిర్మాణానికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నేతలు వి.సన్యాసినాయుడు, చనమల మహేశ్వరరావు, గొర్లె రామునాయుడు, సర్పంచి బంగారునాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రగతి పనులకు శ్రీకారం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ కార్యక్రమాలతో గ్రామాల్లో మౌలిక వసతులు గణనీయంగా మెరుగుపడుతున్నాయని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెంటశ్రీరాంపురం, మదనాపురం గ్రామాల్లో చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్ల వ్యయంతో 30 వేల పనులు చేపట్టడమే పల్లె పండగ లక్ష్యమన్నారు. పెంటశ్రీరాంపురంలో రూ.2 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు, సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, అల్లు విజయ్‌కుమార్, రంది అర్జున మహేశ్వరరావు, దేముడమ్మ, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. • గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులే కీలకమని మంత్రి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసిన గంట్యాడ మండల కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడారు.


పెంటశ్రీరాంపురంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు


ఇట్లామామిడిపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

రామభద్రపురం, బాడంగి, దత్తిరాజేరు, వంగర, మెంటాడ, తెర్లాం, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: భూసమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆర్డీవో రామ్మోహన్ రావు అన్నారు. రామభద్రపురం మండలం ఇట్లామామిడిపల్లిలో శుక్రవారం గ్రామసభను నిర్వహించారు. గత ప్రభుత్వంలో జరిగిన భూసర్వేలోని తప్పులను పరిష్కరించాలని మండల తెదేపా అధ్యక్షుడు కరణం భాస్కరరావు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. 85 మంది రైతులు భూసమస్యలపై దరఖాస్తులు అందజేశారు. • దత్తిరాజేరు మండలం లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని రైతులకు గడబవలస గ్రామసభలో ఎటువంటి సమస్యలు రైతుల నుంచి రాలేదని రీసర్వే డీటీ రత్నకుమారి తెలిపారు. • బాడంగి మండలం పెదపల్లిలో తహసీల్దారు సుధాకర్ గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు. • వంగర మండలం తలగాంలో భూ సమస్యలపై వినతులను తహసీల్దారు ధర్మరాజు స్వీకరించారు. రీ సర్వే డీటీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు. • మెంటాడ తహసీల్దారు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇప్పలవలస రెవెన్యూ పరిధిలో జరిగిన సదస్సులో భూసమస్యలు పరిష్కరించాలని కోరుతూ 24 మంది అర్జీలు అందించారు. • బొబ్బిలి మండలం కారాడలో ఉపతహసీల్దారు అప్పయ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో వివిధ సమస్యలపై 62 వినతులు వచ్చాయి. వీఆర్వోలు సాయికృష్ణ, సుధాకర్, వెంకునాయుడు, సర్వేయర్లు పాల్గొన్నారు.


రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మెంటాడ తహసీల్దారు శ్రీనివాసరావు

విజయనగరం

•విజయనగరం •నెల్లిమర్ల • ఎస్.కోట

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ



సహస్ర దీపాలంకరణ సేవ చేస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చి.. కాలక్షేప మండపంలో ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం దీపాలను వెలిగించి పూజలు చేశారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.



వెల్లివిరిసిన ప్రతిభ



విజయనగరంలోని రింగురోడ్డు శ్రీచైతన్య పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. అంతర్జాల వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జి.ప్రణవ్(తొమ్మిదో తరగతి), కె.గీతశ్రీ(తొమ్మిదో తరగతి), పి.రిషి రాజ్ (ఎనిమిదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానాచార్యుడు శ్రీధర్‌బాబు, ఉప ప్రధానాచార్యుడు విక్రమ్‌కుమార్, డీన్ సూర్యచంద్ర విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.
– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

సమస్యలతో సతమతం

నగరంలోని పలు ప్రాంతాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధికి అడుగులు పడకపోవడంతో నేటికీ కష్టాలు వెంటాడుతున్నాయి. అధ్వాన దారులతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. జిల్లా సముదాయాలున్న చోట ఇంకా మట్టి రోడ్డే కనిపిస్తున్నాయి. కాలువలదీ అదే దుస్థితి. దాసన్నపేట, అంబటిసత్రం ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది.
- న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



అధ్వానంగా సింగపూర్ సిటీకి వెళ్లే దారి

దాసన్నపేటలో రహదారులు గుంతలమయంగా మారాయి. వర్షం పడితే అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. కాలువలు లేకపోవడంతో నీరంతా రోడ్లపైనే నిలిచిపోతోంది. మరోవైపు నాగవంశపు వీధి, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో రూ.200 కుళాయిల నుంచి తాగునీరు రావడం లేదని ఫిర్యాదులున్నాయి. రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కాలనీల వాసులు వాపోతున్నారు. సింగపూర్ సిటీ దారిలో ఉన్న 15 ఎకరాల విస్తీర్ణంలోని ఎర్రచెరువు ఆక్రమణ బారిన పడింది. ఈ ప్రాంతంలో గెడ్డలను మూసేశారు.

వినియోగం ఇంకెప్పుడు..

దాసన్నపేటలో ఐదు సామాజిక మరుగుదొడ్లు ఉన్నా పనిచేయడం లేదు. గొల్లవీధి, మందిబైలు, నాగవంశపువీధి, రౌతువీధి, కుమ్మరి వీధుల్లో వీటిని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితం మరమ్మతులకు గురికావడంతో అలా వదిలేశారు. ఈ ప్రాంతంలో రెండు ఉద్యానాలున్నా.. అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. రైతు బజారు నుంచి డబ్బూరి వేడుక మందిరం వరకు వీధి దీపాలు వెలగడం లేదు.

పార్కింగుకు అవస్థలే..

అంబటిసత్రం దారిలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కొన్నిచోట్ల కాలువలు నిర్మించారు. కొన్నిచోట్ల స్లాబులు, పలకలు వేయడంతో మురుగు తొలగించేందుకు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. కోజీవీధి దారిలో మూడు నెలల క్రితమే సామాజిక మరుగుదొడ్డిని మూసేశారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.



అంబటిసత్రం దారిలో రోడ్డుపైనే వాహనాల నిలుపుదల

యువతకు అవగాహన

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై గణేష్ సూచించారు. శుక్రవారం నెల్లిమర్ల నగర పంచాయతీలోని మొయిద, రామతీర్థం కూడళ్లలో అవగాహన కల్పించారు. అనంతరం సంబంధిత గోడపత్రాలు ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాల వాడకంతో ముప్పు తప్పదని, జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టిసారించాలని ఆయన కోరారు.

రాష్ట్ర మహాసభల విజయవంతానికి పిలుపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏఐఎస్ఎఫ్(అఖిల భారత విద్యార్థి సమాఖ్య) రాష్ట్ర మహాసభల కరపత్రాలను శుక్రవారం డీఈవో ఎన్. ప్రేమకుమార్ తన ఛాంబర్లో ఆవిష్కరించారు. మహాసభల ప్రాముఖ్యతను వివరించారు. విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సంఘం నాయకులు జి.ఫణీంద్ర, ఎన్.నాగభూషణం, పి.గౌరీశంకర్, ఎ.సుమన్ కోరారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో తదితరులు

రామతీర్థం దేవస్థానం అభివృద్ధికి కృషి



శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నాగమాధవి పేర్కొన్నారు. శుక్రవారం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సీతారామునిపేట- గిరిప్రదక్షణ మార్గంలో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గిరిప్రదక్షిణ మార్గం ఏర్పాటుకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎంపీపీ సుధారాణి, డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి పండుగ

జామి, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జామి మండలంలోని యాతపాలెం నుంచి అన్నమరాజుపేట బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నరేగా నుంచి రూ.1.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. యాతపాలెంలో రామాలయం నిర్మిస్తానని ఇచ్చిన హామీని త్వరలో నెరవేరుస్తామన్నారు. ఎంపీడీవో అప్పలనాయుడు, పీఆర్ డీఈ స్వామినాయుడు, స్వామినాయుడు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులంతా ఇంజనీర్లుగా రాణించాలి



ఉప కులపతి రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న శ్రీనివాసరావు

పూసపాటిరేగ/భోగాపురం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులంతా ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలని జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి ఉపకులపతి పి.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన స్వాగతోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది.

రీ సర్వేపై 29 ఫిర్యాదులు

కొత్తవలస, ఎల్.కోట, డెంకాడ: రాయపురాజుపేటలో రెవెన్యూలో గతంలో జరిగిన రీ సర్వేపై శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతులు అర్జీలు అందజేశారు. 29 మంది తహసీల్దారు బి.నీలకంఠరావుకు వినతిపత్రాలు ఇచ్చారు. ఉప తహసీల్దారు అప్పారావు తదితరులు పాల్గొన్నారు. లక్కవరపుకోట మండలం పోతంపేటలో 28, డెంకాడ మండలం చిట్టిగుంకలాంలో 93 ఫిర్యాదులు అందాయని ఆయా తహసీల్దార్లు తెలిపారు.



కొత్తవలస: అర్జీలు పరిశీలిస్తున్న డీటీ అప్పారావు

విజ్ఞాన ప్రదర్శనతో మెరుగైన విద్య



ప్రాజెక్టులను తిలకిస్తున్న డిప్యూటీ డీఈవో రమణ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శనతో మెరుగైన విద్యాభ్యాసం చేకూరుతుందని జిల్లా డిప్యూటీ డీఈవో కేవీ. రమణ పేర్కొన్నారు. శుక్రవారం నెల్లిమర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ప్రదర్శన నిర్వహించారు. 103 మంది బాలికలు, 53 మంది బాలురు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా జిల్లా డైట్ కళాశాల అధ్యాపకులను నియమించారు. జిల్లా సమన్వయకర్త ఫ్లోరెన్స్, ప్రిన్సిపల్ సుధారాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో పతకాలు



కొత్తవలస, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఆర్ట్ పోటీల్లో కంటకాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 పతకాలు సాధించారు. ముంబయికి చెందిన కలర్స్ సంస్థ రంగోత్సవంలో భాగంగా జులైలో పోటీలు నిర్వహించింది. నిర్వాహకులు పంపిన అంశానికి అనుగుణంగా బొమ్మలు వేసి, తపాలా ద్వారా పంపించినట్లు ప్రధానోపాధ్యాయుడు వి.అరుణకుమార్ శుక్రవారం తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఆర్ట్ ఉపాధ్యాయుడు కె.పాపారావు పాల్గొన్నారు.

బాల, బాలికలకు అవగాహన

రింగురోడ్డు: ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని ఆర్‌బీఎస్‌కే కౌన్సిలర్ కొండమ్మ సూచించారు. శుక్రవారం సంస్కృత పాఠశాలలో బాల, బాలికలకు అవగాహన కల్పించారు. తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

లక్కవరపుకోట: గనివాడకు చెందిన వివాహిత(34) అదృశ్యంపై ఆమె భర్త శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్‌పడాల్ తెలిపారు.

నేరాల నియంత్రణకు చర్యలు

నెల్లిమర్ల: మండలంలో నేరాల నియంత్రణకు వార్డు, గ్రామ సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ బి.గణేష్ పేర్కొన్నారు. నెల్లిమర్ల స్టేషన్‌లో వారితో సమావేశం నిర్వహించారు. గంజాయి, జూదం, పందేలపై నిఘా ఉంచాలన్నారు.

విద్యుత్తు శాఖపై ఫిర్యాదు చేస్తాం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ అధికారుల పనితీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. భవానీనగర్ సమీపంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటుకు ఇష్టారాజ్యంగా చెట్లు నరికేశారని ఆరోపించారు.



ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు శుక్రవారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను కలిశారు. గిరిజనుల సమస్యలను ఆయనకు తెలియజేశారు.
– న్యూస్‌టుడే, అయ్యన్నపేట

పేదలకు నిత్యావసరాల పంపిణీ

విజయనగరం కంటోన్మెంట్: కణపాక మారుతీ సేవా సంఘం శుక్రవారం 50 మంది నిరుపేద మహిళలకు నిత్యావసర సరకులు పంపిణీ చేసింది.

నట్టల నివారణ మందు పంపిణీ

వేపాడ: కుంపల్లిలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని పశు సంవర్ధక శాఖ ఏడీ చలపతిరావు శుక్రవారం ప్రారంభించారు.



కొత్తవలస: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర హోంమంత్రి అనితను విజయవాడలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే లలితకుమారి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

రక్షిత ట్యాంకులు శుభ్రం



శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పంచాయతీ పరిధిలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. శుక్రవారం 'ఈనాడు'లో 'ఈ ట్యాంకు శుభ్రం చేసి నాలుగేళ్లు' శీర్షికన వెలువడిన కథనంపై ఆ శాఖ అధికారులు స్పందించారు. పంచాయతీలో అన్ని ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఝాన్సీ తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న కమిషనరు నల్లనయ్య

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ నల్లనయ్య హెచ్చరించారు. శుక్రవారం వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు, పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బందితో సమావేశమయ్యారు. జాబ్‌చార్టు ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని చెప్పారు. అక్రమ కట్టడాలను గుర్తించి, నోటీసులు ఇవ్వాలన్నారు. ప్లాన్ అనుమతులను పరిశీలించి, అవసరం మేరకు సకాలంలో మంజూరు చేయాలన్నారు. ఏసీపీలు వైవీ.రమణమూర్తి, ఎన్.హరిబాబు, టీపీవో ఎన్.అప్పలరాజు, టీపీఎస్ సీహెచ్.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన అవసరం

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని, ఈమేరకు రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.తారక రామారావు సూచించారు. శుక్రవారం విజయనగరం మండలంలోని జొన్నవలస, సారికలో జరిగిన పొలంబడి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని సూచనలిచ్చారు. మండల, గ్రామస్థాయిలో ఉండే సిబ్బంది అన్నదాతలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వ్యవసాయంతో పాటు వాతావరణ పరిస్థితులను తెలియజేయాలని చెప్పారు. వ్యవసాయ సంచాలకుడు నాగభూషణం, మండల వ్యవసాయాధికారిణి హర్షలత, ఎఫ్‌పీవో ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

పరిసరాల శుభ్రత తప్పనిసరి



నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

కొత్తవలస, న్యూస్‌టుడే: ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి కె.గోపాలకృష్ణ సూచించారు. శుక్రవారం దేవాడ, ముసిరాంలో వైద్యాధికారి గోపాలకృష్ణ, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామాలను వైద్యాధికారి సింహాద్రినాయుడు పరిశీలించారు. ఎనిమిది సచివాలయాల పరిధిలో కాలువలు, కుండీల్లో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేశారు. కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్



పరిశీలిస్తున్న ఎంపీడీవో భవాని, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు

కొత్తవలస, డెంకాడ, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: గుర్లలో డయేరియా వ్యాపించడంతో కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు జిల్లాలో రక్షిత మంచినీటి పథకాలను ఆయా ప్రాంతాల అధికారులు, సిబ్బందితో శుక్రవారం పరిశుభ్రతపై దృష్టిసారించారు. కొత్తవలస మండలంలోని 25 పంచాయతీల్లో 55 రక్షిత పథకాలను సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి క్లోరినేషన్ చేయించారని ఈవోపీఆర్డీ శ్రీదేవి తెలిపారు. తుపాను కారణంగా వర్షాలు పడుతుండటంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు సరఫరా చేసే నీటిని విధిగా క్లోరినేషన్ చేసి విడుదల చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ● ఎంపీడీవో వై.భవానీ ఆధ్వర్యంలో డెంకాడ మండలంలోని పినతాడివాడ, డెంకాడ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పనులు జరిగాయి. కాలువల్లో పూడికలు, తుప్పల తొలగింపు కార్యక్రమాలు చేపట్టారు. ● నెల్లిమర్ల మండల కేంద్రం, జరజాపుపేట ప్రాంతాల్లో ఉన్న ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసినట్లు కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు.

విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి

విజయనగరం పట్టణం: విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శంకరరావు డిమాండు చేశారు. శుక్రవారం దాసన్నపేటలోని విద్యుత్తు భవన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ట్రూఅప్ తదితర ఛార్జీలను ఆపేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లు వద్దన్నారు. నాయకులు రమణమ్మ, జగన్‌మోహన్, బి.రమణ, ఆనంద్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఉత్సాహంగా జిల్లాస్థాయి వాలీబాల్ ఎంపికలు



తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ అండర్ 17 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం రాజీవ్ మైదానంలో జరిగాయి. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారిని డీఎస్‌డీవో ఎస్.వెంకటేశ్వరరావు అభినందించారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు మాట్లాడుతూ హిందుపూర్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరగనున్న రాష్ట్ర పోటీలకు జట్లను ఎంపిక చేశామన్నారు. వాలీబాల్ సంఘం కార్యదర్శి కేవీఎఎన్.రాజు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యత



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి అందరూ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే నాగమాధవి, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం పూసపాటిరేగ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పరిశీలించి, పరిష్కారమయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

బీమా ఏజెంట్ల ఆందోళన

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: నూతన పాలసీలపై పెంచిన ప్రీమియంను తగ్గించాలని జీవిత బీమా సంస్థ ఏజెంట్లు కోరుతున్నారు. బోనస్‌ను పెంచి, జీఎస్టీని రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం విజయనగరంలోని బ్రాంచి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఏజెంట్ల సమాఖ్య జోనల్ కమిటీ సభ్యుడు బి.వెంకటరమణ మాట్లాడుతూ ఎల్ఐసీ యాజమాన్యం తీసుకున్న తిరోగమన నిర్ణయాలు తగవన్నారు. ఏజెంట్ల కమీషన్ తగ్గించడం దారుణమన్నారు. సమాఖ్య నాయకులు చిల్లా రామకృష్ణ, ఇల్లాపు కృష్ణ, తుమ్మలగుంటి పవన్‌కుమార్, సబ్బవరపు సూరినాయుడు, విశాఖ డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీమా ఏజెంట్లు

దారపర్తికి క్షేత్ర సహాయకులను నియమించండి



వినతిపత్రం అందిస్తున్న జనసేన నాయకుడు సన్యాశినాయుడు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలో గిరిశిఖర దారపర్తి పంచాయతీకి ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులను నియమించాలని జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాశినాయుడు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ఎంపీడీవో సతీష్, ఎంపీపీ సోమేశ్వర్రావుకు వినతిపత్రం అందజేశారు. 2023 ఏప్రిల్ నుంచి పోస్టులను రెన్యువల్ చేయలేదన్నారు. క్షేత్ర సహాయకుడు లేకపోవడం వల్ల గిరిజన పంచాయతీలో అభివృద్ధి కుంటు పడిందన్నారు. సర్పంచి బి.సన్యాశిరావు, అరుణ్ కుమార్, వార్డు సభ్యుడు రాము, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.